క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఉప్పునుంతల: బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గ్రామాల్లో ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దేవని సతీష్ సూచించారు. సోమవారం మండలంలోని మర్రిపల్లిలో నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆలయంలో మండల పూజలు

లింగాల: మండలంలోని దారారంలో ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం భక్తులు మండల పూజలు నిర్వహించారు. 40 రోజుల క్రితం ఆలయ పునర్నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. ఆలయంలో హోమాలు, అభిషేకాలు చేపట్టారు.

మాజీ సర్పంచ్ మృతి

లింగాల: మండల కేంద్రం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ పల్లె నిరంజన్(63) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. 2014 నుంచి 2019 వరకు సర్పంచ్‌గా కొనసాగి మంచి పేరు తెచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మంచి దళిత నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.

ఇంకుడు గుంతలను పూర్తి చేయండి

చారకొండ: గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతలను పూర్తి చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. సోమవారం మండలంలో తుర్కలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఇంకుడు గుంతల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో అవసరం ఉన్నా చోట సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి

వెల్దండ: మండలంలోని గుండాలలో సోమవారం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతిబాయి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఉచితంగా నోట్‌బుక్‌లు అందిస్తున్నట్లు వివరించారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొత్తగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకున్నారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్ సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఆయా గ్రామాలకు చెందిన వారు మూడు ఫిర్యాదులు అందించారు. చెదురుపల్లిలో నీళ్ల ట్యాంక్‌ను ఇతర ఉపయోగించుకుంటున్నట్లు ఫిర్యాదు చేశారు. కుప్పగండ్లలో ప్రభుత్వ భూమిని కబ్జాపై, పీర్ల చావిడికి దారిలేకుండా కంచె నిర్మిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్, అధికారులు ఉన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో అద్దెకు వ్యవసాయ పరికరాలు

తాడూరు: జిల్లా గ్రామీణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ సహాయసహకారాతో మండల సమాఖ్య ద్వారా సోమవారం ఎంపీపీ శివలీల ట్రాక్టర్ ప్రారంభించారు. ఇక నుంచి సమాఖ్య ద్వారా వ్యవసాయ పరికరాల యంత్రాలన్నీ గంట చొప్పున అద్దెకు ఇస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో ఉండే అద్దె కన్న తక్కువకు లభిస్తాయని, అవకాశాన్ని మండల రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సమ్మద్‌పాషా, ఎంపీడీఓ గంగామోహన్, ఏపీఓ తిరుపతయ్య, డీటీ మహమ్మద్‌అలీ, ఎంపీఓ లక్ష్మన్‌నాయక్, ఏఓ సాయి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రకల్‌లో గీతవనం ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: చంద్రకల్‌లో శ్రీనివాస్‌గౌడ్ వ్యవసాయ పొలంలో ఈత మొక్కలను ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు సోమవారం నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గీతవనాలు ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు స్వచ్ఛమైన కల్లు లభిస్తుందని తెలిపారు. భూములు కలిగిన గౌడ కులస్తులు ఈత మొక్కలు నాటుకోవాలని సూచించారు.

ఐదుగురిపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని గుండాల రెవెన్యూ శివారులో హైదరాబాద్‌కు చెందిన రవికిరణ్ రవికిరణ్ పొలాన్ని పక్కన ఉన్న రైతులు కబ్జా చేసేందుకు ఆదివారం రాత్రి పొలానికి కంచెగా ఉన్న రాతి కడ్డిలను అజయ్, వందన, రాజబాబు, కమల, జగదీశ్ ధ్వంసం చేశారు. సోమవారం రవికిరణ్ పొలం వద్దకు వెళ్లి చూసే సరికి విషయాన్ని గమనించి వారిని ప్రశ్నించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



జిల్లా కేంద్రంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

కందనూలు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ రామాలయంలో శ్రీరామ సహిత వెంకట సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వరదరాజన్ అయ్యంగార్ మాట్లాడుతూ.. ఈ వ్రతాలు చేయడంతో భక్తులకు కోరిన కోరికలు, దారిద్ర్యం తొలగి అష్ట ఐశ్వర్యాలు సిరి, సంపదలు సిద్ధిస్తాయని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలోని శివాలయంలో పరమశివుని భక్తులు దర్శించుకున్నారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి బాబా మందిరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ ఆవరణలో సోమవారం భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. పూజారి కపిలవాయి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలతో పాటు యజ్ఞహోమాలు చేపట్టారు. ఐతోల్‌లో గురుపౌర్ణమితో పాటు వ్యాస పౌర్ణమి సందర్భంగా సర్పంచ్ ఇందుమతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక షిరిడీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంతో పాటు మండలంలో సోమవారం భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయి మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని షిరిడీ సాయి మందిరంలోని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



జిల్లా కేంద్రంలో సత్యసాయిబాబ ఆలయంలో..

ఉదయం నుంచే భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణపతి పూజ, అష్టోత్తర పుష్పార్చన, మహామంగళహారతి చేపట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోడేరు: మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామివారికి కాగడ హారతి, అభిషేకం, సంధ్యా హారతి, శ్వేజహారతి తదితర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ తెలిపారు.

దోమలపెంట: ఈగలపెంటలోని షిరిడీసాయి బాబ మందిరంలో సోమవారం ప్రత్యేక అలంకరణ, పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ (సివిల్) రవీంద్రకుమార్, ఈఈ రమేష్, కుటుంబ సమేతంగా అధికంగా పాల్గొన్నారు.



కల్వకుర్తిలో..



కోడేరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఈగలపెంటలో..

కనీస వేతనం అమలుకు డిమాండ్



జిల్లా కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 5వ తేదీ నుంచి చేపట్టనున్న ధర్నా వాల్‌పోస్టర్‌లను సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు పీఆర్‌సీని అమలు చేయకపోవడం కార్మికుల కష్టాన్ని కాలరాయడమేనని ఆరోపించారు. మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులు ఏ పని చేయాలో తెలియక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పర్వతాలు, రామయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నామని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రాములు, సాయిబాబు, శేఖర్, శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు.

బీజేపీని బలోపేతం చేయాలి

కోడేరు: బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ కేంద్ర పరిశీలకుడు శ్రీధర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గ్రామ గ్రామాల్లో వివరించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, బాలపీరు, భానుచందర్, మహేష్, శ్రీకాంత్, రామస్వామిపాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేసిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని 1వ వార్డు వడ్డెర బస్తీలో డిజిటల్ బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, రవిగౌడ్, రామాంజనేయులు, శ్రీరాములుపాల్గొన్నారు.



కోడేరులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పోడు పట్టాలపై కొత్త సమస్య



అటవీశాఖ అధికారుల వద్దకు వచ్చిన పిల్లిగుండ్ల ఆదివాసీ చెంచులు

ఏళ్లుగా సాగుచేస్తున్న భూములను ఇతరులకు ఇచ్చారని ఆరోపణ

మన్ననూర్: ప్రభుత్వం ఇచ్చిన పోడు భూముల పట్టాలు తమ ప్రాణాలమీదికి వచ్చినట్లుందని పదర మండలం పిల్లిగుండ్ల చెందిన గిరిజనులు వాపోతున్నారు. ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న పోడు భూములను క్షేత్ర స్థాయిలో సర్వేలు చేసి పట్టాలు ఇవ్వకపోవడం ఏమిటని 25 మంది ఆదివాసి గిరిజనులు అధికారులను అడిగేందుకు మన్ననూర్‌లోని ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్‌ఓ కార్యాలయాలకు సోమవారం తరలివచ్చారు. పిల్లిగుండ్లలో సుమారు 60 గిరిజన కుటుంబాలు పోడు భూములు సాగు చేసుకుంటుండగా 20 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. ఫారెస్టు, రెవెన్యూ అధికారులు గతంలో సాగులో ఉన్న సుమారు 160 ఎకరాల భూమి సర్వే చేయడంతో పాటు అందుకు సంబంధించిన హద్దులు ఏర్పాటు చేశారన్నారు. ఇది ఇలా ఉంటే పోడు భూములు సాగు చేసుకోని వారికి, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి, 40 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న వారి పొలాల హద్దులు చూపిస్తూ పట్టాలు ఇచ్చారన్నారు. తప్పుడు నిర్ణయాలతో అధికారులు ఇచ్చిన హద్దులు, పట్టా బుక్కుల ఆధారంగా భవిష్యత్‌లో మా భూముల మీదికి ఇతరులు వస్తే మేము ఏమైపోవాలని పోడు రైతులు ప్రశ్నించారు. ఒకరి భూమిని మరొకరి పేరున పట్టాలు ఇచ్చి మా మధ్య తగాదాలు పెంచుకునే పరిస్థితి ప్రభుత్వ అధికారులు తీసుకువచ్చారని చెంచులు ఆరోపించారు. 50 కిలో మీటర్ల దూరం నుంచి వస్తే అధికారులు మాట్లాడనీయకుండా కలెక్టర్ వద్దకు పోయి అడగండని చెబుతున్నారన్నారు.

కలెక్టర్ వద్దకు పోయి అడగమన్నారు..



40 ఏళ్లుగా మేము సాగు చేసుకుంటున్న పొలానికి అధికారులు వచ్చి సర్వే చేశారు. ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వాళ్లందరకీ పట్టాలు వస్తాయని అధికారులు గతం నుంచి చెప్పుకొచ్చారు. తీరా అచ్చంపేటలో ఎమ్మెల్యే, కలెక్టర్ ఇచ్చిన పట్టా బుక్కుల లిస్టులో మా పేరు లేదు. మాతో పాటు మా గ్రామంలో చాలా మంది పేర్లు లేవు. ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న మాకు పట్టా బుక్కులు ఎందుకు రాలేదని అధికారులను అడిగితే.. కలెక్టర్ వద్దకు పోయి అడగండని సమాధానం ఇస్తున్నారు. – మెండ్లి ఈదమ్మ, పిల్లిగుండ్ల

లీగల్ ఎయిడ్ సభ్యుల నియామకం

కొల్లాపూర్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు లీగల్ ఎయిడ్ సభ్యులను నియమించారు. ఈమేరకు హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఎస్.నిరంజన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఎస్.రామలక్ష్మమ్మ, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు పానుగంటి బాలస్వామిలను లీగల్ ఎయిడ్ సభ్యులుగా నియమించారు. వీరి నియామకంపై స్థానిక న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన

పెద్దకొత్తపల్లి: రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్యారాలీగల్‌సెల్ ఆధ్వర్యంలో పెద్దకార్పాముల రైతువేదికలో సమావేశం నిర్వహించారు. ప్యారాలీగల్ వలంటీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో రైతులు మందులు కొన్నప్పుడు రశీదులు తప్పనిసరి పొందాలని సూచించారు. కిరాణ షాపుల్లో ఎరువులు, విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయొద్దని తెలిపారు. ఎరువులు కొనేటప్పుడు ప్రతి రైతు ఆధార్‌కార్డు తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ పొందాలని అన్నారు. రైతులకు సమస్యలు ఉంటే లీగల్ 7 క్లీనిక్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

కల్వకుర్తిరూరల్: ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ కపట నాటకాలు మొదలు పెట్టిందని, రాష్ట్రంలో పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని జాగృతి జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ గణేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మోసపూరిత హామీలతో ప్రజలను వంచించాలనుకుంటే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదని పేర్కొన్నారు.

బైరాపూర్‌ను వెల్దండలోనే కొనసాగించాలి



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో సోమవారం సర్పంచ్ దార్ల కుమార్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇర్విన్ కొత్త మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇర్విన్ మండలంలో బైరాపూర్ గ్రామాన్ని కలపాలని సర్పంచ్‌పై ఒత్తిడి తీసుకురావడంతో గ్రామంలో సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. మెజార్టీగా వెల్దండలోనే గ్రామాన్ని ఉంచాలని తీర్మానించారు. ప్రజల కోరిక మేరకు బైరాపూర్‌ను పాత మండలమైన వెల్దండలోనే కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

బల్మూర్: మండలంలోని పోలేపల్లి రామలింగేశ్వరాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా భక్త ఆంజనేయస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆన్‌లైన్ యూత్ క్విజ్ పోటీలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న రాముయాదవ్

కొల్లాపూర్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ యూత్ క్విజ్ పోటీలపై కళాశాలల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాముయాదవ్ అవగాహన కల్పించారు. సోమవారం ఆయన పట్టణంలోని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు మొబైల్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌తో పాటు పలు అంశాలపై క్విజ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, వెంకటస్వామి తదితరులున్నారు.

బస్సులు సమయానుసారం నడపండి



వినతిపత్రం అందజేస్తున్న కోడేరు గ్రామస్తులు

కోడేరు: మండల కేంద్రంలో కొంత కాలంగా సమయానుసారం బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు వనపర్తి డిపో మేనేజర్ పరమేశ్వరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని, డిపో మేనేజర్ స్పందించి త్వరలో సమయానికి బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో మచ్చ రాములు, లక్ష్మయ్య, సాయిరాంరెడ్డి, రాజు, పోశయ్య, ఈశ్వర్, వెంకటస్వామి, రాములు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయం



మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్: వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన ఫౌండేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధికారంలోకి రావటానికి ఆదివారం ఖమ్మం జనగర్జన సభ నిదర్శనమని అన్నారు. పార్టీకి ప్రజలలో మద్దతు పెరిగిందని, అధికార పార్టీ ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజలు వాటిని దాటుకొని సభకు వచ్చి వారి మద్దతును తెలిపారన్నారు. పార్టీ తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపై స్పందించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని నోటీసులో పేర్కొన్నారని, పార్టీ కార్యక్రమాలకు విరుద్ధంగా నేను ఎక్కడ పాల్గొన్నానో నిరూపించాలని అన్నారు.

వెల్దండ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, పూర్వ వైభవం తీసుకువస్తామని చౌదర్‌పల్లి మాజీ సర్పంచ్ రామచంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పార్టీలో చేరడంతో కార్యకర్తల్లో జోష్ నింపిందన్నారు.

చారకొండ: రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకవిధానాతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయాయని విమర్శించారు.

బీసీ పేదలకు ఇళ్ల స్థలాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చౌటబెట్లలో 1995లో ప్రభుత్వం గ్రామ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 26లో 6 ఎకరాల భూమిని రైతు నుంచి కొనుగోలు చేసింది. కానీ బీసీలలో ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వలేదు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అధికారులు గ్రామానికి రాగా ఇంటి స్థలాలు లేని పేదలు వారి దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి అందుకు సంబంధించిన లేఅవుట్‌ను తయారు చేసి పేదలకు న్యాయం చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సోమవారం మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా స్థలాన్ని సందర్శించి 100 మంది పేదలకు 75 గజాల చొప్పున పంపిణీ చేశారు. ఇది ఇలా ఉండగా గతంలో పట్టాదారుగా ఉన్న గ్రామ రైతులు భూమి ప్రభుత్వానికి ఇవ్వలేదని అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని సముదాయించి పంపిణీ కార్యక్రమాన్ని ముగించారు.

విద్యుత్ మోటారు చోరీ

కోడేరు: మండల కేంద్రంలోని శివారులో ఉన్న ఎంజీకేఎల్ఐ పస్పుల, పాన్‌గల్ బ్రాంచ్ కాల్వలో రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండల కేంద్రానికి చెందిన అడిమయ్య యాసంగిలో వరి పంటను కేఎల్ఐ కాల్వలో మోటారు పెట్టుకొని సాగు చేస్తున్నాడు. పంట కోతలు అయిన తర్వాత కాల్వలో కొంత సాగునీరు ఉండటంతో విద్యుత్ మోటారును అలాగే ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు కాల్వలో ఉన్న విద్యుత్ మోటారును దొంగిలించారని బాధితుడు సోమవారం తెలిపాడు. మోటారు విలువ రూ.40వేల వరకు ఉంటుందని పేర్కొన్నాడు.

గురువు స్థానం ఉన్నతమైంది



గురువులను సన్మానిస్తున్న కందనూలు కళా సేవా సమితి సభ్యులు

కందనూలు: సమాజంలో ఏనాటికై నా గురువు స్థానం ఉన్నతమైనదని కందనూలు కళా సేవా సమితి అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో కందనూలు కళా సేవా సమితి ఆధ్వర్యంలో పలు రంగాలలో విశిష్ట సేవలు అందించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక చింతన కలిగిన గురువులు ఏటూరు బాలస్వామిని, పుండరీకాచారి, నరసింహులును ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో గురువు యొక్క స్థానం దిగజారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళీధర్ రావు, రాములు, సత్యం, బాస వెంకటేశ్వర్లు, రామ్మోహన్, సురేష్ బాబు, బాల్‌రాజు, సుదర్శనాచారి, జాఫర్, రమేష్ సతీష్ పాల్గొన్నారు.

మహిళపై దాడి: ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని వీరంరాజ్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దొంతి కళమ్మపై అదే గ్రామానికి చెందిన లింగయ్య, అతని కుమారుడు రమేష్ చిట్టి డబ్బుల విషయంలో గొడవ పడి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి



ఏడు తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒకే ఉపాధ్యాయుడు

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని సర్పంచ్ నిరంజన్ పేర్కొన్నారు. పచ్చని చెట్ల వాతావరణంతో పాఠశాల నడుస్తున్నప్పటికీ 1 నుంచి 7 తరగతుల వరకు దాదాపు వందకు పైగా విద్యార్థులు ఉన్నారని కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో పాఠశాల నడవడం వల్ల విద్యాబోధన కుంటుపడుతుందని విచారం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాల పరిసరాలను పరిశీలించిన సర్పంచ్ ఇద్దరు ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లడంతో ఒకే ఉపాధ్యాయుడితో 7 తరగతుల నిర్వహణ తన కంటపడిందని డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను అల్లాపూర్ పాఠశాలకు పంపాలని ఆయన అధికారులకు కోరారు.

ఐదు తరగతులకు ఒకే గది



మర్రిగుంతతండాలో చెట్లకిందనే బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

వెల్దండ: మండలంలోని మర్రిగుంత తండా ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత వేధిస్తుంది. ఐదు తరగతులు నిర్వహిస్తుండగా కేవలం ఒకే గది ఉంది. పాఠశాల ఆవరణలో మొత్తం మూడు గదులు ఉన్నాయి. కొత్తగా పంచాయతీ కావడంతో పాఠశాలలోనే ఒక గదిలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మన ఊరు–మన బడి సంబంధించిన సామగ్రి గత నెలలో రావడంతో మరో గదిలో భద్రపరిచినారు. దీంతో పాఠశాలకు ఒకే గది ఉండడంతో కార్యాలయం, 1, 2వ తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల కొరత ఉండడంతో 3, 4, 5వ తరగతులను ఆరుబయట చెట్లకింద నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే ఇబ్బందులు తప్పడం లేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మన ఊరు–మన బడి సామగ్రిని త్వరగా ఖాళీ చేసి విద్యార్థులకు గదుల కొరత తీర్చాలని గ్రామస్తులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.